www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025



నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మే 4న నిర్వహించే నీట్ పరీక్షకు ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, పరీక్షలు నిర్వహణ డిస్టిక్ నోడల్ అధికారి, ఎన్ఐటి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,100 మంది అభ్యర్థులు నీట్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటి, శశి కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఆఫ్ లైన్‌లో జరుగుతుందని తెలిపారు. సమావేశంలో డిఇఒ ఇ.నారాయణ, పరీక్షలు నిర్వహణ డిస్టిక్ నోడల్ అధికారి ఎన్.జయరాం, ఎన్ఐటి సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామ్స్ ఎన్.సునీల్ కుమార్ పాల్గొన్నారు.



భీమవరం అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలియజేస్తున్న ముస్లిం సంఘాలు, సిపిఎం నేతలు

ప్రజల మధ్య మత చీలికలు తెస్తున్న బిజెపి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ముస్లిం సంఘాల నిరసనలకు సిపిఎం సంపూర్ణ మద్దతు

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం



తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - భీమవరం

వక్ఫ్ చట్ట సవరణ దుర్మార్గమని, రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. పెద్ద మసీదు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీకి ముస్లిములు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ర్యాలీకి సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో మైనారిటీలకు, దళితులకు, క్రైస్తవులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. బిజెపి తన హిందుత్వ, మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని రెచ్చగొడుతుందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టనున్నారని ఆరోపించారు. ఈ చట్టం ముస్లింల ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. రాష్ట్రంలో లౌకికవాద పార్టీలుగా చెప్పుకుంటున్న టిడిపి, జనసేన ఈ బిల్లును ముక్తకంఠంతో బలపరచడం ముస్లిములను మోసగించడమేనన్నారు. వక్ఫ్ ఆస్తుల స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికీ లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా, భారత రాజ్యాంగంలోని 25, 29, 30 నిబంధనలకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందన్నారు. ప్రజల మధ్య మత చీలికలు తెచ్చి, మతపరమైన ఘర్షణలకు తావిచ్చేలా బిజెపి వ్యవహరిస్తోందని దీనిని లౌకికవాదులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, ఇంజేటి శ్రీనివాస్, ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ రబ్బాని, గౌరవాధ్యక్షులు ఎంఎ.నౌషద్, నాయకులు ఎమ్‌డి.ఫర్హాన్, ఎమ్‌డి.అఫ్జల్ పాషా, ఎమ్‌డి.కరీముల్లా, ఎంఎ.పాషా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక పోలీసు ఐల్యాండ్ సెంటర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ నిరంకుశ చర్య దేశ లౌకికవాదానికి విఘాతం కల్గించడమే కాకుండా దేశాన్ని మతరాజ్యంగా మార్చే చర్య అని అన్నారు. వీటిని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు,



ఆచంటలో..

పి.దుర్గారావు, పోతు శ్రీను, వెంకన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆచంట: మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ బోర్డు చట్ట సవరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ సమీపంలో మసీదు వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు టి.బుల్లబ్బాయి, కుసుమ జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, ముస్లిం పెద్దలు షేక్ మస్తాన్, షేక్ సయ్యద్ బాజీ, నాగూర్, కాశీం, వల్లి, లేఖత్, ఖాదర్ భాషా పాల్గొన్నారు.

తణుకు రూరల్: వక్ఫ్ బోర్డు చట్ట సవరణ వెంటనే విరమించుకోవాలని సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, నాయకులు అంబటి రామకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేల్పూరు మసీదు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నేతలు కుడక వీరభద్రరావు, ముస్లిం పెద్దలు షేక్ సత్తార్, భాషా, లాల్‌సాహెబ్, మీరాసాహెబ్ పాల్గొన్నారు.

నరసాపురం: వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో పంజా సెంటర్, చేపల మసీదు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పొగాకు పూర్ణ, పొగాకు నారాయణరావు, నోముల కొండ, ముస్లిం పెద్దలు ఎమ్‌డి.అజీజ్,




నరసాపురంలో..

ఎమ్‌డి.షానవాజ్‌ఖాన్, ఎస్‌కె.అహ్మద్‌షా, ఎస్‌కె.మహ్మద్ షరీఫ్, ఎమ్‌డి.మోహిద్, ఎమ్‌డి.ఫిరోజ్‌ఖాన్, నూర్ మహ్మద్ మోహిద్దిన్, ఎమ్‌డి.అబ్దుల్‌రషీ, ఎస్‌కె.అబ్దుల్లా పాల్గొన్నారు.

పెనుగొండ: వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన పెనుగొండ, సిద్ధాంత మసీదుల వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు షేక్ నాగూర్ మీరా, భాషా, షేక్ సుజాయుద్దీన్, షాకీర్ బాయ్, ఎస్‌కె.షరీఫ్, సిద్ధాంతం గ్రామ మసీదు అధ్యక్షుడు షేక్ అమీన్, ఎమ్‌డి.షాన్‌వాజ్, సిపిఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, కడలి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కేంద్ర ప్రభుత్వానికి భారత రాజ్యాంగంపై కనీస విశ్వాసం ఉంటే వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని తణుకు నియోజకవర్గ జెఎసి కన్వీనర్ ఎమ్‌డి.అబ్దుల్ రెహమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా వేల్పూరు రోడ్డులోని మసీదు వద్ద నుండి నరేంద్ర సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న, ముస్లింల మతపరమైన హక్కులను కాలరాస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లును సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కామన మునిస్వామి, జమాత్ ఏ ఇస్లామీ హింద్ వారు సుమారు 250 మంది పాల్గొన్నారు.

ఉండి: వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక జామియా మసీదు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



పెనుగొండలో..



ఉండిలో..



తణుకులో..

ఉండి ఎంసి ఛైర్మన్‌గా జుత్తిగ నాగరాజు

ప్రజాశక్తి - ఉండి



ఉండి ఎఎంసి ఛైర్మన్‌గా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు నియమితులయ్యారు. ఉండి మండలం మహాదేవపట్నం గ్రామానికి చెందిన జుత్తిగ నాగరాజు గతంలో టిడిపి హయాంలో ఎఎంసి వైస్ ఛైర్మన్‌గా, మహాదేవపట్నం గ్రామ ఉపసర్పంచిగా పదవులు నిర్వహించారు. టిడిపి నుంచి వైసిపిలో చేరిన తర్వాత వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై జనసేనలో చేరారు. పవన్ కళ్యాణ్ నాగరాజుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంతో నాటి నుంచి పార్టీ బలోపేతానికి నిర్విరామంగా కృషి చేశారు. గత ఎన్నికల్లో టిడిపితో పొత్తు కారణంగా ఉండి సీటు టిడిపికి దక్కడంతో జనసేన అధినేత ఆదేశాల మేరకు కనుమూరి రఘురామకృష్ణంరాజు విజయానికి కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఎఎంసి ఛైర్మన్ పదవి దక్కింది.

పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్‌గా కోడి విజయభాస్కర్

ప్రజాశక్తి - పాలకొల్లు



ఎంతోకాలంగా ఊరిస్తున్న పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ పదవి కోడి విజయభాస్కర్‌కు దక్కింది. పలు ఎఎంసిలకు ఛైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిలో జిల్లాకు చెందిన పాలకొల్లు, ఉండి ఎఎంసిలకు ఛైర్మన్ల నియామకం జరిగింది. పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన కోడి విజయభాస్కర్ 1969 సెప్టెంబర్ 11న మొగల్తూరు మండలం శేరేపాలేనికి చెందిన కోడి సోమన్న, సీతామహాలక్ష్మి దంపతులకు జన్మించారు. హైస్కూల్ విద్య వరకు శేరేపాలెంలో చదివారు. హైస్కూల్‌లో ఉండగానే ఆయన ఎన్‌టిఆర్ వీరాభిమాని. 1989లో పాలకొల్లు మండలం సగం చెరువుకు చెందిన విజయలక్ష్మితో వివాహమైంది. ఎనిమిది సంవత్సరాలపాటు టిడిపి పాలకొల్లు మండల కార్యదర్శిగా పని చేశారు. 2014లో రామానాయుడు ఎంఎల్‌ఎగా ఎన్నికైన అనంతరం విజయభాస్కర్ మండల టిడిపి మండల అధ్యక్షులుగా నియమితులయ్యారు. వీరికి నలుగురు కుమార్తెలు. ఈయన భార్య విజయలక్ష్మి 2006-11 మధ్య సగంచెరువు సర్పంచిగా, 2014-19 మధ్య జెడ్‌పిటిసిగా పని చేశారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు చైతన్యవంతులు కావాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు చెత్త నిర్మూలనకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన 'పరిశుభ్ర నరసాపురం' కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, శానిటరీ వర్కర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నరసాపురంలో చెత్త డంపింగ్ పెద్ద సమస్యగా మారిందని, గోదావరి నది ఒడ్డున డంపింగ్ చేయడంతో భూమి, వాయు, నీరు కాలుష్యం అవుతున్నాయన్నారు. విధినిర్వహణలో ఉత్తమంగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆమె అభినందించారు. మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్తరహిత నరసాపురంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు అవసరమైన స్థల సేకరణలో ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌తోనే 30 శాతం డంపింగ్ నిండిపోతుందని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పర్యవేక్షించేందుకు టీమ్స్‌ను నియమించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు అవసరమైన పరికరాలను, యూనిఫామ్‌ను వెంటనే ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిణి, కౌన్సిలర్లు బొమ్మిడి సూర్యకుమారి, తోట అరుణ, కొప్పాడ కృష్ణవేణి పాల్గొన్నారు.



సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పిఎం లంక అభివృద్ధికి చర్యలు

పిఎం లంక అభివృద్ధికి కేంద్ర ఆర్థిక మంత్రి అన్ని చర్యలూ చేపట్టారని, పిల్లలను పాఠశాలకు విధిగా పంపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం ఆమె పెదమైనవానిలంకలోని డిజిటల్ భవనాన్ని, సముద్రపు కోతకు గురయ్యే ప్రాంతంలో డెలాయిట్ కంపెనీ చేపట్టనున్న ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించారు. డిజిటల్ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ భవన్‌కు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తారన్నారు. రూ.40 లక్షల వ్యయంతో లైబ్రరీ భవనం, టాయిలెట్స్‌కు నీటి సదుపాయం, ప్రహరీ నిర్మాణం, రూ.25 లక్షల వ్యయంతో అంగన్వాడీ కేంద్ర నిర్మాణం, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, రూ.20 లక్షలతో కల్చరల్ ఓపెన్ ఆడిటోరియం, రూ.30 లక్షలతో మహిళా సమాఖ్య భవనం, రూ.40 లక్షలతో పిహెచ్‌సి సబ్ సెంటర్ నుండి పడవల రేపు వరకు సీసీ రోడ్డు నిర్మాణం, తదితర పనులు రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. సముద్రపు కోతకు గురికాకుండా రెండున్నర కిలోమీటర్లు అడ్డుగోడ నిర్మాణం చేపట్టాలనేది ప్రతిపాదించగా, తొలుత ఒక కిలోమీటర్ పరిధిలో చేపడతామని చెప్పారు. తర్వాత దాన్ని విస్తరిస్తారన్నారు. ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రతిఒక్కరికీ ఉపాధి చూపాలి

జాబ్ కార్డు పొందిన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి డ్వామా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నరసాపురం మండలం వేములదీవి ఈస్ట్‌లో ఉపాధి హామీ పనులను, లక్ష్మణేశ్వరం హౌసింగ్ కాలనీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లక్ష్మణేశ్వరం హౌసింగ్ లేఅవుట్‌లో నిర్మాణ దశలో ఉన్న ప్రతి ఇంటినీ ఆమె సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీకి రాకపోకలు సాగించే ఒక దారిని ఫెన్సింగ్‌తో మూసివేయడం కారణంగా నడకదారికి ఇబ్బందిగా ఉందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆర్‌డిఒను ఆదేశించారు.

పింఛన్.. టెన్షన్..!

వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ వేగవంతం

రెవెన్యూ డివిజన్ పరిధిలో పింఛన్‌దారులంతా ఒకచోటుకు

ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద కిటకిట

దూరం నుంచి రాలేక వికలాంగుల అవస్థలు

రెండు జిల్లాల్లో దాదాపు 60 వేల మంది లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వికలాంగుల పింఛన్‌దారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పింఛన్ ఉంటుందా.. కారణాలు బూచిగా చూపి తొలగిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ప్రభుత్వం వికలాంగుల పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ వేగవంతంగా సాగిస్తోంది. ఏలూరు జిల్లాలో మొత్తం 2,60,195 సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుండగా ఇందులో దాదాపు 33 వేల వరకూ వికలాంగుల పింఛన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2,25,718 పింఛన్లు ఉండగా వికలాంగుల పింఛన్లు 27 వేలు వరకూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగుల పింఛన్లలో అనర్హులు ఉన్నారంటూ వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. ముందుగా మంచానికే పరిమితమైన రూ.15 వేలు పింఛన్ అందుకుంటున్న వారిని వెరిఫికేషన్ చేసింది. ఆ ప్రక్రియ పూర్తయ్యింది. వెరిఫికేషన్ జాబితాను మాత్రం బహిరంగపర్చలేదు. ఇప్పుడు నెలకు రూ.ఆరువేలు పింఛన్ అందుకుంటున్న వికలాంగుల పింఛన్లను వెరిఫికేషన్ చేస్తోంది. బుధ, గురు, శుక్రవారాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ సాగింది. ఇంకా చేయాల్సి ఉంది. రెవెన్యూ డివిజన్ పరిధిలోని వికలాంగులను ఒకచోటుకు రప్పించి ఈ వెరిఫికేషన్ ప్రక్రియ సాగిస్తున్నారు. ఏలూరు డివిజన్ పరిధిలో పింఛన్ అందుకుంటున్న వికలాంగులందరినీ ఏలూరు సర్వజన ఆసుపత్రికి రప్పిస్తున్నారు. ఎముకలకు సంబంధించిన వికలాంగులకు భీమడోలు, కైకలూరులోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ చేస్తున్నారు. చెవి, మానసిక, ఇతర సమస్యలు ఉన్న వికలాంగులంతా ఏలూరు సర్వజన ఆసుపత్రికి రావాల్సిందే. ఒకపక్క వేసవి ఎండలు, మరోపక్క దూర ప్రయాణంతో వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. డిఆర్‌డిఎ సిబ్బంది ఆసుపత్రి వద్ద టెంట్లు వేసుకుని ఈ ప్రక్రియను సాగిస్తున్నారు. వెరిఫికేషన్‌కు వచ్చిన వికలాంగులంతా గంటల తరబడి వేచి ఉండలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు వంటి వసతులు సైతం సరిగా ఏర్పాటు చేయలేదు. వికలాంగుల పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా సాగుతుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి.



ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద వచ్చిన వికలాంగ పింఛన్ దారులు

పింఛన్ల లబ్ధిదారులను తగ్గించే ఎత్తుగడ అంటూ విమర్శలు


కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రూ.మూడు వేలు పింఛన్ రూ.నాలుగు వేలు చేస్తామని, వికలాంగులకు రూ.మూడు వేల నుంచి రూ.ఆరు వేలు ఇస్తామని ప్రకటించింది. గెలిచిన తర్వాత అనుకున్నట్లు పింఛన్ పంపిణీ ప్రారంభించింది. అయితే పింఛన్ల భారం పెరగడంతో తగ్గించుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ముందుగా వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిందనే చర్చ సాగుతోంది. గతంలో ఇదే అధికారులు ఉన్నారు. అప్పుడు పింఛన్ మంజూరు చేసిన డిఆర్‌డిఎ అధికారులే ఇప్పుడు మళ్లీ వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొంటున్నారు. అనర్హులు ఉంటే తొలగించడం తప్పుకాదు. అందుకోసం పింఛన్ అందుకుంటున్న వికలాంగులందరినీ ఇబ్బంది పెట్టడం ఏవిధంగా సమంజసమో అర్థం కావడం లేదు. పింఛన్లు తగ్గించుకునేందుకు అంగవైకల్యం శాతం తక్కువగా చూపించి తొలగిస్తారేమోననే భయం వికలాంగులను వెంటాడుతోంది. అనర్హుల వ్యవహారం సాకుగా చూపి కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొత్త పింఛన్లను మంజూరు చేయకుండా నిలిపివేసింది. దీంతో ఎంతోమంది పింఛన్ల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

దాతల సహకారంతో గ్రామాలాభివృద్ధి

తాగునీటి చెరువును ప్రారంభించిన కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారం అభినందనీయమని కేంద్ర ఉక్కు గనుల భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. గణపవరం నివాసి ఎన్ఆర్ఐ వేగేశ్న అనంత కోటిరాజురాజు వేగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుట్టిన ఊరు అభివృద్ధికి రూ.50 కోట్లు అందించి గ్రామస్తులకు దాహార్తి తీర్చడానికి స్థానిక గాంధీ చెరువును రూ.20 కోట్లతో అభివృద్ధి చేశారని మంత్రి తెలిపారు. అలాగే రూ.15 కోట్లతో వాటర్ ట్యాంకు నిర్మాణం, ఆర్ఒ ప్లాంటు, పైప్‌లైన్లు ఏర్పాటు చేశారని చెప్పారు. మరో రూ.15 లక్షలతో జగన్నాథపురంలో పాఠశాల అదనపు గది కాంపౌండ్ హాల్ నిర్మించాని చెప్పారు. అమెరికా వెళ్లినా పుట్టిన ఊరు అభివృద్ధికి విరాళాలు అందించి గ్రామాభివృద్ధికి చేయూత ఇస్తున్న అనంత కోటిరాజు ధన్యులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీక్ రఘు రామకృష్ణంరాజు, ఉంగుటూరు మాజీ శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాస్‌రావు, సర్పంచి మూరా అలంకారం పాల్గొన్నారు.



మొగల్లు ప్రభుత్వం కాలనీని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ఆక్వా చెరువుల వ్యర్థాలతో ముంపులో కాలనీ

చిన్నారులు, వృద్ధులు జ్వరాలతో విలవిల

ముంపు నివారణలో అధికారులు విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

నాకు కాదు ఎంపిడిఒకు ఫోన్ చేయాలని తహశీల్దార్ అనడం సరికాదు

మొగల్లులోని ప్రభుత్వ కాలనీని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు ప్రభుత్వ కాలనీ తరచూ ముంపుకు గురవుతున్నా అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. మొగల్లు ప్రభుత్వ కాలనీని సిపిఎం బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి మూడు నెలలకోసారి కాలనీ ముంపునకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆక్వా చెరువుల వ్యర్థాలతో పిల్లలు రోగాల బారిన పడ్డారని, జ్వరాలతో బాధపడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ మొగల్లుతోపాటు గరగపర్రు, గొల్లలకోడేరు, శృంగవృక్షం, పాలకోడేరు గ్రామాలకు చెందిన 750 మందికి స్థలాలిచ్చారని తెలిపారు. ఎన్నో బాధలు, ఇబ్బందులతో ఇళ్లు కట్టుకుంటే ముంపు వేధిస్తుందన్నారు. దీనిపై తహశీల్దార్ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్తే 'నా పరిధి కాదు, ఎంపిడిఒతో మాట్లాడుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం సరైంది కాదని విమర్శించారు. ముంపు సమస్యపై కలెక్టర్ తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నేతలు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, గ్రామ కార్యదర్శి పాలా వెంకటస్వామి, నాయకులు వీరవల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల బాబురావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పైపుల లీకులు.. పట్టని అధికారులు..!

పట్టణ ప్రజల ఆవేదన


పైప్‌లైన్ లీకవ్వడంతో పాడైన రోడ్డు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతి నీటి బొట్టూ ఒడిసి పట్టి రాబోయే తరాలకు ప్రకృతి సిద్ధమైన వనరులను అందించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు మాసోత్సవాల్లో ఉపన్యాసాలతో అదరగొడతారు. తర్వాత విధుల పట్ల ఎక్కడైనా మచ్చుకైనా పనిలో చిత్తశుద్ధి కనిపించదని పలువురు విమర్శిస్తున్నారు. ఏటా పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో ఎక్కడ చూసినా పైపుల లీకులు కనిపిస్తున్నాయని, అయినా పట్టడం లేదని విమర్శిస్తున్నారు.

భీమవరంలోని 39వ వార్డులో ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులు అనేక ప్రాంతాల్లో లీకవుతున్నాయి. అసలే వేసవికాలం అని, శుద్ధి చేసిన నీరు ఇలా నేలపాలు కావడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జువ్వలపాలెం రోడ్డులోని వెంకటేశ్వరస్వామి గుడి ప్రాంతంలో పైపు లీక్ అవుతోందని, అలాగే ఎంసి మార్కెట్ యార్డ్‌లోకి వెళ్లే దారిలో, అలాగే గొల్లవానితిప్ప రోడ్డు దుర్గమ్మ గుడి సమీపంలో స్వీట్ షాపు వద్ద పైపులైన్ల లీకేజీ వల్ల నీరు వృథా కావడమే కాకుండా గోతులు పడి రోడ్డు అధ్వానంగా తయారైంది. అయినా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఇంజినీరింగ్ శాఖ అధికారులు పర్యవేక్షించాలి. అయితే మున్సిపల్ కార్యాలయంలో ఈ శాఖ అధికారులు నిర్లక్ష్యం మాటల్లో చెప్పలేమని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల సొమ్మును లక్షల్లో జీతాల రూపంలో నెలనెలా అందుకుంటున్నారు తప్ప ఎక్కడైనా పైప్‌లు లీక్ అయితే వెంటనే స్పందించడం లేదని, పట్టనట్లుగా వెళ్లిపోతున్నారని తెలిపారు.

పట్టణంలో పైపులు లీకేజీలు జరిగిన ప్రాంతంలో నెలల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆ ప్రాంతంలోని రోడ్డు పూర్తిగా పాడైపోతోంది. దీంతో ఆ ప్రాంతంలోని గోతులు ఏర్పడి ఆ గోతుల్లో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, మున్సిపాల్టీకి ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పందించి ఇంజినీరింగ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పేదల ఇళ్ల తొలగింపు ఆపాలి

తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు సుబ్బరాజు చెరువు గట్టున ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న పేదల ఇళ్ల తొలగించే ప్రక్రియను నిలుపుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశియ్య కోరారు. పాలకోడేరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్‌వి.విజయలక్ష్మికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశియ్య మాట్లాడుతూ సుబ్బరాజు చెరువు గట్టున 23 కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాయని తెలిపారు. నిరుపేదలు ఇక్కడ నివాసం ఉండడం వలనే అడ్డు కాదని, అయితే ఇళ్లు తొలగిస్తామని చెప్పడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. పంచాయతీ అధికారులు ఇళ్లు తొలగిస్తున్నామని సంతకాలు చేసి నోటీసులు తీసుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు దృష్టికి స్థానిక పేదలు తీసుకెళ్లగా, ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులకు ఆయన చెప్పారు. అయితే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇళ్లు తొలగించేందుకు రంగం సిద్ధం చేయడం సరికాదన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు దున్న మరియమ్మ, శ్రీను, వెంకన్న ఉన్నారు.

వైద్య రంగంలో అవకాశాలు మెండు

ప్రజాశక్తి - నరసాపురం

వైద్య రంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్‌కు చెందిన జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ కవురు రాధా మనోహర్ తెలిపారు. వైఎన్ కళాశాల హెచ్‌ఆర్‌డి సెంటర్, ఐక్యూ ఎసి ఆధ్వర్యంలో హాస్పిటల్ మేనేజ్మెంట్, ప్లేస్మెంట్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాధా మనోహర్ మాట్లాడారు. వైద్యరంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, అందుకు తగ్గట్టుగా మేనేజ్మెంట్ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగావకాశాలు చేజిక్కించుకోవచ్చని తెలిపారు. మెడ్ యునైటెడ్ హాస్పిటల్‌కు చెందిన మార్కెటింగ్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మాట్లాడుతూ మెడ్ యునైటెడ్ హాస్పిటల్ త్వరలో పాలకొల్లులో ప్రారంభం కాబోతోందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, ఎంబిఎ విభాగాధిపతి ఆర్.పార్థసారథి, హెచ్‌ఆర్‌డి సెంటర్ డైరెక్టర్ సిహెచ్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిప్పరలో సెల్‌ఫోన్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

వినియోగదారులకు అందుబాటు ధరలో సెల్ ఫోన్లు ఉన్నాయని, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం పిప్పరలో జనసేన నాయకులు రేపాక కేశవ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెల్ షాపును ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశవ తన వ్యాపారాభివృద్ధికి కృషి చేసుకోవాలని, వినియోగదారుల పట్ల నమ్రతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

తణుకు ఎంపిడిఒగా శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు ఎంపిడి ఒగా ఎస్.శ్రీనివాస్ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. తణుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న ఆర్.లోహిత్ జయసాగర్ వ్యక్తిగత కారణాలపై సెలవుపై వెళ్లడంతో ఇరగవరం ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి పివివిఎస్.రాంప్రసాద్, ఎఒ వి.కృష్ణ చంద్రరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా అయితం వీర వెంకట సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ తహశీల్దార్‌గా పనిచేస్తున్న టి.రాజరాజేశ్వరి సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం సివిల్ సప్లై డీటీగా పనిచేస్తున్న సత్యనారాయణకు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను డీటీ ప్రసాద్, ఆర్ఐ ఎం.లక్ష్మీనారాయణ, విఆర్ఒ జయరాం తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ నియామకం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కాంగ్రెస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించింది. శుక్రవారం భీమవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ప్రకటించిన సభ్యులకు జిల్లా డిసిసి ప్రెసిడెంట్ హరికుమార్‌రాజు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హరికుమార్ రాజు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి బూత్ లెవెల్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, పార్టీ బలోపేతం కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎప్పుడైనా ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కొత్తగా నియమితులైనవారిలో జిల్లా వైస్ ప్రెసిడెంట్లుగా అద్దంకి దొరబాబు, ఎడ్ల శివాజీ, గాదిరెడ్డి వనమయ్య, పోలమెర్ల వెంకటేశ్వరరావు ఉన్నారు. జిల్లా జనరల్ సెక్రటరీలుగా పుచ్చకాయల రత్నరాజు, సనకు ప్రసాద్, ధర్మేంద్ర, కృష్ణ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించగా, మేడపాటి సాగర్, కొర్ర శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని జిల్లా జాయింట్ సెక్రటరీలుగా నియమించినట్లు హరికుమార్ రాజు తెలిపారు.

విద్యాభివృద్ధికి దాతల ఉదారత ముఖ్యం

సత్యవరం పాఠశాల శత వసంతాల వేడుక

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి సాధనకు స్థల దాతల ఉదారత ముఖ్యమైందని సత్యవరం గ్రామ సర్పంచి ఏడుసూతుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని సత్యవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల శత వసంతాల వేడుక సభకు ఆయన అధ్యక్షత వహించారు. 1924లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు స్థలం ఇచ్చిన నల్లమిల్లి కుటుంబానికి, 2002లో ప్రాథమికోన్నత పాఠశాలగా మారడానికి స్థలం ఇచ్చిన మల్లిడి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ ప్రధానోపాధ్యాయులు బోళ్లజి సత్యనారాయణ, కోసూరి సత్యనారాయణ రాజు, వై.అశోక్ కుమార్, పాలా ప్రసాద్, ఎంవిహెచ్.సుబ్రహ్మణ్యం, నమ్మి కనక నాగేశ్వరరావు, జోస్యుల వెంకట్రావు తదితరులకు ఉత్సవ కమిటీ తరుపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి నల్లిమిల్లి వివేకానంద రెడ్డి, మాజీ నీటి సంఘం ఛైర్మన్ మల్లిడి వెంకట రెడ్డి, ఎంపిటిసి గెడ్డం ఈశ్వరుడు, ఎస్ఎంసి ఛైర్మన్ బాలం శ్రీనివాస్, హెచ్ఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మాట్లాడుతున్న సర్పంచి శ్రీనివాస్


పిప్పరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

పిప్పరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు నచ్చిన రైసుమిల్లును తానే ఎంచుకొని ధాన్యాన్ని అమ్ముకోవచ్చని చెప్పారు. ధాన్యాన్ని మిల్లుకు పంపిన తరువాత మిల్లర్ లాగిన్‌లో అక్నాలెడ్మెంట్ అయిన 48 గంటల్లో రైతు ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో సొమ్ములు జమ అవుతాయని చెప్పారు. ధాన్యం కొనుగోలు అనంతరం కొనుగోలుకు సంబంధించి రశీదు రైతులు తీసుకోవాలని


ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

చెప్పారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. వ్యవసాయ జెడి జడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇ-పంట నమోదు అయిన రైతులు తమ పంట అమ్ముకోవడానికి వాట్సప్ ద్వారా షెడ్యూల్ చేసుకోవాలని చెప్పారు. తాడేపల్లిగూడెం ఎడిఎ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్ఎస్‌కెలో టెక్నికల్ సిబ్బంది ధాన్యం నాణ్యతన పరిరశీలించడానికి రైతు కల్లం దగ్గరకు వచ్చి చూస్తారని తెలిపారు. సివిల్ సప్లై మేనేజర్ శివరాం ప్రసాద్ మాట్లాడారు. మండల వ్యవసాయాదికారి వై.ప్రసాద్, కూటమి నాయకులు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వాసురాజు, ఎంఎల్ఒ దాసు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని కాళ్ల, దొడ్డనపూడి, జువ్వలపాలెం, ఏలూరుపాడు, కలవపూడి గ్రామాల్లోని పాఠశాల ఉపాధ్యాయులను కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో తనకు అఖండ విజయాన్ని అందించినందుకు ఉపాధ్యాయ, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించకుండా విద్యార్థులకు పాఠాలు బోధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలను మెయిన్ స్కూల్స్‌లో విలీనం చేయాలని ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వానికి వివరిస్తానని చెప్పారు. సమస్యల సాధనకై ఉపాధ్యాయులు చేసే పోరాటాలకు తన మద్దతు తెలియజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్‌రావు, కార్యదర్శులు ప్రభుదాస్, అప్పల నాయుడు, పివి.రామరాజు పాల్గొన్నారు.



డిగ్రీ సర్టిఫికెట్‌లు అందజేస్తున్న విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్

విద్యార్థులు లక్ష్యంతో పనిచేయాలి

విద్యాశాఖ ఆర్‌జెడి శోభారాణి

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యం నిర్ణయించుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి చెప్పారు. పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 58వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులు, విద్యార్థులను అలరించాయి. ముఖ్య అతిథి శోభారాణి మాట్లాడుతూ అసామాన్య అతిథిగా మారాలంటే ఇష్టపడి కష్టపడి చదవడమే మార్గం అన్నారు. ఒకరి దగ్గర పనిచేసే కన్నా స్టార్ట్ అప్ కంపెనీ పెట్టుకొని స్వయంగా ఎదగాలని కోరారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి అధ్యక్షతన వహించారు. డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడారు. ఇటీవల గ్రాడ్యుయేట్ అయిన వారికి డిగ్రీ సర్టిఫికెట్‌లు అందజేశారు. అనంతరం కళాశాలలో నూతన అడ్మిషన్ల కరపత్రాన్ని ఆర్‌జెడి ఆవిష్కరించారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

ప్రజాశక్తి - ఇరగవరం

సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని, దీనికి సిపిఎం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అనాన్నారు. శుక్రవారం మండలంలోని కాలనీ ప్రజలను సిపిఎం నేతలు కలివారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన విషయాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రజాచైతన్య యాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కలిశామని చెప్పారు. కలెక్టర్ స్పందించి తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గోపాలన్ తెలిపారు. ప్రజలంతా వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడతారని, కొత్తగా ఏర్పడిన కాలనీలో తాగునీరు, కరెంటు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కామన మునిస్వామి, జుత్తిగ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని తొలగించాలని చూస్తున్నారు..

సచివాలయం వద్ద మేటు మాధురి, ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు



ఆందోళన చేస్తున్న కార్మికులు, మేట్

ఉపాధి హామీ చట్టంలో కార్మికుల గ్రూపులకు మేటుగా పనిచేస్తున్న తనను తొలగించి అధికార పార్టీ వారికి ఇచ్చేందుకు పలువురు అధికార పార్టీ నాయకులు తమపై దౌర్జన్యం చేస్తున్నారని పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన ఉపాధి కార్మికురాలు గుబ్బల మాధురి తెలిపారు. ఈ మేరకు పేరుపాలెం సౌత్ గ్రామ సచివాలయం వద్ద ఉపాధి కూలీలు శుక్రవారం పలుగు, పారలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో అర్హులైన కుటుంబాలకు ఉపాధి హామీ కార్డులను చేయించి, రెండు గ్రూపులకు మేటుగా పనిచేస్తూ వారితో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నానని అన్నారు. ఉదయం పనికి వెళ్లిన సమయంలో జనసేన నాయకులు వనమాలి శ్రీనివాస్, ఓసూరి రాంబాబు, తంగెళ్ల శ్రీనివాస్ మహిళనని కూడా చూడకుండా తనపై దౌర్జన్యం చేసి మరో వ్యక్తిని మేటుగా నియమించామని, కూలీలు ఎవరూ మాధురి మాట వినొద్దని హెచ్చరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ జెండా మోసిన వారికి మేటుగా ఏర్పాటు చేశామని జనసేన నాయకులు చెబుతున్నారని తెలిపారు. తనపై కక్ష ఇలా సాధింపు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . దీనిపై ఎంపిడిఒ, ఎంఎల్ఎకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు.

ప్రభుత్వ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పెనుమంట్ర+మండలంలోని పెనుమంట్ర గ్రామపంచాయతీ పరిధిలో బ్రాహ్మణ చెరువు నేలపోగులు రోడ్డులో రెండు కాలువల మధ్యలో ఇచ్చిన ప్రభుత్వ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని శుక్రవారం సిపిఎం మండల కమిటీ కోరింది. కాలనీలో తాగునీటి పైపులు వేయాలని, వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. పంట కాలువ పొంగి ఇళ్ల వద్దకు నీరు రావడంతో భయాందోళనకు గురవుతున్నారని నేతులు తెలిపారు. కాలనీలో విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉందని భయపడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, వి.భాస్కరరావు, పిప్పరపల్లి భాస్కరరావు, ఉందుర్తి.కిట్టయ్య పాల్గొన్నారు.

శృంగవృక్షంలో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు


మృతి చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు

అనుమానాస్పద స్థితిలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలం పరిధిలోని శృంగవృక్షంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పాలకోడేరు ఎస్ఐ మంతెన రవి వర్మ తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సిహెచ్ వెంకటేశ్వరరావు (37) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ప్రస్తుతం ఆకివీడు పోలీస్ స్టేషన్లో వెంకటేశ్వరరావు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే అనారోగ్య కారణం వల్ల స్వగ్రామమైన శృంగవృక్షంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే అర్ధరాత్రి కాల కృత్యాలు తీర్చుకునేందుకు బాత్ రూమ్‌కు వెళ్లారు. అయితే ఎంతసేపటికి రాకపోవడంతో ఆయన భార్య వెళ్లి చూడగా స్పృహ కోల్పోయి ఉండడం గ్రహించి దగ్గరలో ఉన్న ఆర్ఎంపికి చూపించారు. ఆయన వెంకటేశ్వరరావును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవి వర్మ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వానికి రైతులు అండగా నిలవాలి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్న కుటమి ప్రభుత్వానికి మరో పదిహేనేళ్ల కొనసాగేలా అన్నదాతలు అండగా నిలవాలని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గం పూలపల్లిలో రూ.కోటీ ఆరు లక్షలతో జున్నూరు పంట కాలువ వెంబడి నిర్మించనున్న రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడంతో పాటు అన్నదాతలను పట్టించుకోలేదని, వ్యవసాయాన్ని గాలికి వదిలేశారని


రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

తెలిపారు. అందుకే జగన్‌కు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని, భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి రాకుండా బెంగాళాఖాతంలో తరిమికొట్టాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో జున్నూరు ఛానల్ రహదారి నిర్మాణం చేపట్టింది తానేనన్నారు. వైసిపి ఐదేళ్లలో రోడ్డుకు రాయి కూడా వేయలేదన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు మేలు ఈ రోడ్డు వేస్తున్నామని గత ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వానికి తేడా తెలుసుకోవాలని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, ఇరిగేషన్ డిఇ వెంకటనారాయణ, తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, ఎంపిడిఒ ఉమా మహేశ్వరరావు, వేగేశ్న శ్రీహర్షరాజు, గుబ్బల హరిప్రసాద్, గబ్బిడి నరసింహరాజు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సొసైటీకి ఉపయోగపడే పరిశోధనాత్మక ప్రాజెక్టులు చేపడితే భవిష్యత్తులో సొసైటీకి ఉపయోగంతో పాటు విద్యార్థుల ఉన్నతికి కూడా దోహదపడతాయని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. కళాశాల ఇసిఇ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఐఇటిఇ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం క్రక్స్ 2కె 25 పేరిట హార్డ్‌వేర్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను జగపతి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోలార్ సిస్టం, రోబోట్, సాయిల్ టెస్టింగ్‌తో పాటు ఎన్నో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు నూతన టెక్నాలజీని జోడిస్తే స్టార్టపులు పెట్టి ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. సుమారు 50 ప్రాజెక్టులకు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్వయం సోపాన ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం కాపు, బిసి కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ముఖాముఖీ నిర్వహించారు. అధికారులు మూడు బృందాలుగా ఆయా గ్రామాల దరఖాస్తుదారులకు ముఖాముఖీలు నిర్వహించారు. ఎంపిడిఒ త్రిశూలపాణి, తహశీల్దార్ రాజకిశోర్, ఇఒపిఆర్‌డి మేడిద నవీన్ కిరణ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో వేములదీవి పడమరలోని మల్టీపర్పస్ భవనంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ఆంధ్ర హాస్పటల్ వారిచే గుండె స్కానింగ్, వంగాయగూడెం ఏలూరు వారిచే ఫైబ్రో స్కానింగ్ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు కనకం వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి పులపర్తి మోహన అర్జునుడు, పిఎంపి డబ్ల్యుఎ రాష్ట్ర యాక్షన్ కమిటీ ఛైర్మన్ సుంకర కోటేశ్వరరావు పాల్గొన్నారు.